న్యూస్‌రీల్

భవన నిర్మాణానికి భూమిపూజ



భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే దివాకర్‌రావు

మంచిర్యాలటౌన్‌: మంచిర్యాల మున్సిపాలిటీ పరిధిలోని 8వ వార్డు పాతమంచిర్యాల ఏరియాలో సిడిపి స్కీం ద్వారా మంజూరైన రూ.50లక్షల నిధులతో నిర్మించే కమ్యూనిటీ భవన నిర్మాణ పనులకు ఆదివారం ఎమ్మెల్యే దివాకర్‌రావు భూమిపూజ చేసి ప్రారంభించారు. కార్యక్రమంలో మున్సిపల్‌ చైర్మన్‌ పెంట రాజయ్య, వైస్‌ చైర్మన్‌ గాజుల ముఖేష్‌ గౌడ్‌, 9వ వార్డు కౌన్సిలర్‌ బొలిశెట్టి సునీత కిషన్‌, డిసిసిబి డైరెక్టర్‌ యెర్రం తిరుపతి, కౌన్సిలర్లు, బీఆర్‌ఎస్‌ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

'పిరమిడ్‌' ఆధ్వర్యంలో ట్రెక్కింగ్‌, ధ్యానం

మంచిర్యాలరూరల్‌(హాజీపూర్‌): మండలంలోని బుగ్గగట్టు కొండపై ఆదివారం మంచిర్యాల పిరమిడ్‌ స్పిర్చువల్‌ సొసైటీ మూమెంట్‌ ఆధ్వర్యంలో ట్రెక్కింగ్‌, ధ్యానం కార్యక్రమాలు నిర్వహించారు. బుగ్గగట్టుపైకి పిరమిడ్‌ సభ్యులంతా కలిసి ట్రెక్కింగ్‌తో కొండపై కొలువై ఉన్న హన్మాన్‌ ఆలయం వరకు వెళ్లి ఆలయ ప్రాంగణంలో ప్రత్యేకంగా సమావేశమై శ్వాసపై ధ్యాసతో ఆరోగ్యంగా ఉండాలని, మాంసాహారాలు మాని శాఖాహారంతో మానసిక ప్రశాంతతో మెరుగైన ఆరోగ్యం పొందాలని సూచించారు. అనంతరం సభ్యులంతా కలిసి ధ్యానం చేసి పిరమిడ్‌ లక్ష్య సాధనలో భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు.

కార్మికుల సంక్షేమానికి నిరంతరం కృషి



క్యాలెండర్‌ ఆవిష్కరిస్తున్న జీఎం సంజీవరెడ్డి

నస్పూర్‌: సింగరేణి సంస్థలో పని చేస్తూ పదవీ విరమణ పొందిన కార్మికుల సంక్షేమానికి సంస్థ నిరంతరం కృషి చేస్తుందని శ్రీరాంపూర్‌ ఏరియా జీఎం సంజీవరెడ్డి తెలిపారు. సింగరేణి పద్మశాలీ ఉద్యోగుల సంఘం, పద్మశాలీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నస్పూర్‌ కాలనీలోని సింగరేణి గార్డెన్‌లో ఆదివారం పద్మశాలీ వివాహ పరిచయ వేదిక కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. అనంతరం సంఘం నూతన క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. నస్పూర్‌ కాలనీలో మార్కండేయ మహర్షి ఆలయ నిర్మాణానికి కేటాయించిన సింగరేణి స్థలంలో వివాదాన్ని త్వరలో పరిష్కరిస్తామని తెలిపారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు చిలువేరు సదానందం, టీబీజీకేఎస్‌ ఏరియా ఉపాధ్యక్షుడు సురేందర్‌రెడ్డి, ఏఐటీయూసీ బ్రాంచి కార్యదర్శి ముస్కె సమ్మయ్య, కౌన్సిలర్‌ బండి పద్మ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌లో చేరిక

దండేపల్లి: మండలంలోని గూడెం గ్రామానికి చెందిన పలువురు ఆదివారం బీఆర్‌ఎస్‌ పార్టీలో చేరగా, నడిపెల్లి ట్రస్టు చైర్మన్‌ విజిత్‌రావు కండువాలు కప్పి ఆహ్వానించారు. కార్యక్రమంలో రైతుసమితి జిల్లా కన్వీనర్‌ గురువయ్య, పార్టీ మండల అధ్యక్షుడు శ్రీనివాస్‌, మండల నాయకులు నారాయణ, మధు, శ్రీనివాస్‌, సృజన్‌, రాజశేఖర్‌, నరేష్‌ తదితరులు పాల్గొన్నారు.

కూరగాయల ధరలు

కూరగాయలు	ధర(కిలో)
టమాట	రూ.10
పచ్చిమిర్చి	60
చిక్కుడు కాయ	60
బీరకాయ	90
వంకాయ	60
కాకరకాయ	70
బెండకాయ	40
అలసంద	50
దొండకాయ	80
ములక్కాయ	120
సోరకాయ	30
పూగోబి	70
ఆకుగోబి	60
తోటకూర	40
పాలకూర	40
క్యారెట్‌	60
క్యాప్సికం	80

- మంచిర్యాలఅగ్రికల్చర్‌



ట్రాఫిక్‌ పద్మవ్యూహం!

- పనిచేయని ట్రాఫిక్‌ సిగ్నల్స్‌
- ఇష్టారీతిన వెళ్తున్న వాహనాలు
- పట్టించుకోని అధికారులు
- ఇబ్బంది పడుతున్న వాహనదారులు



సీసీసీ కార్నర్‌ వద్ద పనిచేయని ట్రాఫిక్‌ సిగ్నల్స్‌

నస్పూర్‌: పట్టణ పరిధిలోని సీసీసీ కార్నర్‌, షిర్కే టర్నింగ్‌ తెలంగాణ తల్లి విగ్రహం చౌరస్తా వద్ద ఏర్పాటు చేసిన ట్రాఫిక్‌ సిగ్నల్స్‌ 20రోజులుగా పనిచేయడం లేదు. ఆయా ఏరియాల్లో వాహనాలు ఇష్టారీతిగా వెళ్తుండడంతో ట్రాఫిక్‌ జామ్‌ అయి వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. మరోవైపు తోళ్లవాగు నుంచి శ్రీరాంపూర్‌ ఏరియా జీఎం కార్యాలయం వరకు చేపట్టిన జాతీయ రహదారి విస్తరణ పనులు కొనసాగుతున్నాయి. పనుల్లో భాగంగా రోడ్డుకిరువైపులా మట్టి తీయడంతో రోడ్డు ఇరుకుగా మారింది. వేల సంఖ్యలో వాహనాలు రాకపోకలు సాగించే ఈ రోడ్డుపై ట్రాఫిక్‌ సిగ్నల్స్‌ పని చేయకపోయినా అధికారులు పట్టించుకోకపోవడంపై ప్రజలు మండిపడుతున్నారు.

అలంకార ప్రాయంగా...

నస్పూర్‌ పట్టణ జనాభా దినదినాభివృద్ధి చెందడంతో పాటు పట్టణం నుంచి పలు ప్రాంతాలకు వాహనాల రాకపోకలు సైతం పెరిగాయి. జాతీయ రహదారి నుంచి నస్పూర్‌ కాలనీ, శిర్కే కాలనీ, నాగార్జున కాలనీలతో పాటు తాళ్లపల్లి, సింగాపూర్‌ ఆర్‌అండ్‌ఆర్‌ కాలనీలకు వెళ్లేందుకు తెలంగాణ తల్లి విగ్రహం వద్ద ఏర్పాటు చేసిన ట్రాఫిక్‌ సిగ్నల్స్‌, జాతీయ రహదారి నుంచి సీసీసీ, బంగ్లా ఏరియాకు వెళ్లే రోడ్డు, సీతారాంపల్లి వైపు వెళ్లే రోడ్డు సీసీసీ కార్నర్‌ బస్టాఫ్‌ వద్ద ఏర్పాటు చేసిన ట్రాఫిక్‌ సిగ్నల్స్‌ పనిచేయక అలంకారప్రాయంగా మిగిలిపోయాయి.

వాహనదారులకు తప్పని ఇబ్బందులు..

సిగ్నల్స్‌ పనిచేయకపోవడంతో వాహనాలు ఇష్టారీతిన వెళ్తుండటంతో ట్రాఫిక్‌ సమస్యలు తప్పడం లేదు. నిజామాబాద్‌-జగ్దల్‌పూర్‌ 363జాతీయ రహదారి కావడంతో వాహనాల రద్దీ ఎక్కువగా ఉంటుంది. మరోవైపు మంచిర్యాల జిల్లా కేంద్రం కావడం సీసీసీ నస్పూర్‌ మున్సిపాలిటీ కావడం, సింగరేణి ప్రాంతం కావడంతో కార్మికుల, ప్రయాణికుల రాకపోకలు ఎక్కువగానే ఉంటాయి. ప్రతి రోజు ఉదయం ఆరు నుంచి ఏడు గంటల వరకు, మధ్యాహ్నం రెండు నుంచి మూడు గంటల వరకు వేల సంఖ్యలో సింగరేణి కార్మికులు విధులు నిర్వర్తించేందుకు వెళ్తుంటారు. పాఠశాలలు, కళాశాలల బస్సుల రాకపోకలు ఎక్కువగానే ఉంటాయి. ట్రాఫిక్‌ సిగ్నల్స్‌ పని చేయకపోవడంతో ట్రాఫిక్‌జామ్‌ అయి వాహనదారులు, కార్మికులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

పర్యవేక్షణ బాధ్యత ఎవరిది..?

పట్టణంలో సీసీసీ కార్నర్‌, షిర్కే చౌరస్తాలో ఏర్పాటు చేసిన ట్రాఫిక్‌ సిగ్నల్స్‌ పనిచేయడం లేదని కార్మికులు మున్సిపల్‌, పోలీసుశాఖతో పాటు నేషనల్‌ హైవే అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదు. మూడు శాఖల మధ్య సయోధ్య లేకపోవడంతో సిగ్నల్స్‌ చెడిపోయి 20రోజులు దాటినా పట్టించుకునే వారు కరువయ్యారు. ఈ విషయమై 'సాక్షి' మున్సిపల్‌ కమిషనర్‌ రమేశ్‌ని సంప్రదించగా మా పరిధిలోకి రాదని పోలీసుశాఖ వాళ్లు చూసుకుంటారని సమాధానమిచ్చారు. స్థానిక ఎస్సై రవికుమార్‌ను సంప్రదించగా నేషనల్‌ హైవే వాళ్లు చూసుకుంటారని తెలిపారు. నేషనల్‌ హైవే డీఈ అన్నయ్యను 'సాక్షి' సంప్రదించగా మా బాధ్యత కాదని సమాధానమిచ్చారు. పర్యవేక్షణ బాధ్యత ఎవరిదైనా, సిగ్నల్స్‌ పనిచేసేలా చూసి ట్రాఫిక్‌ సమస్య పరిష్కరించాలని పట్టణ వాసులు కోరుతున్నారు.

ఇబ్బందవుతుంది..

నేను నాగార్జునకాలనీలో ఉంటూ శ్రీరాంపూర్‌లోని ఎస్సార్పీ 3గనిలో విధులు నిర్వహిస్తున్నాను. తెలంగాణ తల్లి విగ్రహం వద్ద, సీసీసీ కార్నర్‌ వద్ద ట్రాఫిక్‌ సిగ్నల్స్‌ పనిచేయకపోవడంతో ట్రాఫిక్‌జాం అయి ఇబ్బంది తప్పడం లేదు. సంబంధిత శాఖ అధికారులు చొరవ చూపి సమస్య పరిష్కరించాలి.

- శ్రీనివాస్‌, గని కార్మికుడు, నాగార్జున కాలనీ

అలరించిన కవి సమ్మేళనం

మంచిర్యాలఅర్బన్‌: స్థానిక సరస్వతీ శిశుమందిర్‌లో జిల్లా సాహితీ సంరక్షణ సమితి ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన కవి సమ్మేళనం అలరించింది. అలిశెట్టి ప్రభాకర్‌ రచనలపై ఉపాధ్యాయిని దరిపెల్లి స్వరూప మాట్లాడారు. గణతంత్ర దినోత్సవం అనే అంశపై శ్రీనాథ్‌, అడ్డగూరి శ్రీలక్ష్మీ, సంతోష్‌, సుగుణాకర్‌, బహ్మయ్యచారి కవితాగానం చేశారు. కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు వామన్‌రావు పాల్గొన్నారు.

నాట్య గురువుకు గజ్జె పూజ



బెల్లంపల్లి: బెల్లంపల్లిలోని శ్రీ షిరిడి సాయిబాబా ఆలయంలో ఆదివారం కూచిపూడి గజ్జె పూజ ఘనంగా జరిగింది. ప్రముఖ నాట్య గురువు పేర్ల అర్చన పర్యవేక్షణలో ఆమె వద్ద కూచిపూడి నాట్యంలో శిక్షణ తీసుకుంటున్న బాలికలు గజ్జె పూజ చేయించారు. శాస్త్రోక్తంగా పూజ చేసి చిన్నారులను ఆశీర్వదించారు. బాయిజమ్మ సేవా ట్రస్ట్‌ ఆధ్వర్యంలో నాట్య గురువు అర్చనకు శాలువా కప్పి ఘనంగా సన్మానం చేశారు. కార్యక్రమంలో శ్రీ షిరిడి సాయిబాబా దేవాలయం ప్రధాన అర్చకుడు రాంపల్లి విజయ్‌శర్మ, బాయిజమ్మ సేవా ట్రస్ట్‌ వ్యవస్థాపకుడు కాంపల్లి శంకర్‌, నిర్వాహకులు రాజేశ్వరి, బొద్దున సతీష్‌, బాలికల తల్లిదండ్రులు, ఆలయ కమిటీ సభ్యులు, సేవకులు, భక్తులు పాల్గొన్నారు.

సాక్షి సినిమాలు



మంచిర్యాల
శ్రీనివాస : వాల్తేరు వీరయ్య
వెంకటేశ్వర : వీరసింహారెడ్డి
జెమిని సినిమా స్క్రీన్‌ 1 : పఠాన్‌/ వాల్తేరు వీరయ్య/హంట్‌
జెమిని సినిమా స్క్రీన్‌ 2 : మాలికాపురం /వారసుడు

లక్సెట్టిపేట
మహానంద : వాల్తేరు వీరయ్య

జన్నారం
రాఘవేంద్ర : వాల్తేరు వీరయ్య

చెన్నూర్‌
శ్రీశ్రీనివాస : వాల్తేరు వీరయ్య

బెల్లంపల్లి
రామకృష్ణ : వీరసింహారెడ్డి
బాలాజీ : పఠాన్‌

సీసీసీ
దేవి : పఠాన్‌
తిరుమల : వాల్తేరు వీరయ్య

- మంచిర్యాలటౌన్‌

అటెన్షన్‌ ప్లీజ్‌..

తవ్వారు.. వదిలేశారు..!



మంచిర్యాలక్రైం: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల మెయిన్‌ గేటు పక్కన, పైపులైన్‌ లీకేజీ కారణంగా నెల రోజుల క్రితం మున్సిపల్‌ సిబ్బంది జేసీబీతో తవ్వి లీకేజీని గుర్తించి సిమెంట్‌ చేశారు. కానీ గుంతను పూడ్చివేయకుండానే వదిలేశారు. అయినా లీకేజీ ఎప్పటిలాగే కావడంతో గుంతలో నీరు నిండిపోయి పెద్దమడుగుల ఏర్పడి ప్రమాదకరంగా ఉంది. గుంతను ఆనుకొని ఉన్న విద్యుత్‌ స్తంభానికి ప్రమాదం పొంచి ఉంది. కళాశాలకు వెళ్లే దారిలోనే తవ్విన మట్టిని పోయడంతో విద్యార్థులకు, కళాశాల సిబ్బందికి ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించాలని పలువురు కోరుతున్నారు.

సంబంధిత అధికారి : మున్సిపల్‌ కమిషనర్‌ బాలకృష్ణ   ఫోన్‌ నంబర్‌ : 9849905886

'కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యం'



క్రికెట్‌ మ్యాచ్‌ను ప్రారంభిస్తున్న సురేఖ

నస్పూర్‌: నియోజకవర్గ అభివృద్ధి కాంగ్రెస్‌తోనే సాధ్యమవుతుందని డీసీసీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ తెలిపారు. 'గడపగడపకూ పీఎస్‌ఆర్‌–గడపగడపకూ కాంగ్రెస్‌' కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని కృష్ణాకాలనీలో ఆదివారం ఆమె పర్యటించారు. కాలనీలో నెలకొన్న పలు సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు చిందం మల్లేశ్‌, ఆడెపు శ్యామల విజయ్‌ తదితరులు పాల్గొన్నారు.

క్రికెట్‌ టోర్నమెంట్‌ ప్రారంభం

మంచిర్యాలటౌన్‌: మున్సిపాలిటీ పరిధిలోని 9వ వార్డు అండాలమ్మ కాలనీలో కాంగ్రెస్‌ పార్టీ వార్డు అధ్యక్షుడు స్వామి ఆధ్వర్యంలో నిర్వహించిన క్రికెట్‌ టోర్నమెంట్‌ను ఆదివారం ఆ పార్టీ జిల్లా అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ హాజరై మ్యాచ్‌ను ప్రారంభించారు. కార్యక్రమంలో కాంగ్రెస్‌ నాయకులు తూముల నరేష్‌, క్రీడాకారులు పాల్గొన్నారు.

సమాచారం

దరఖాస్తుల ఆహ్వానం

కాసిపేట: మండల కేంద్రంలోని తెలంగాణ మోడల్‌ స్కూల్‌లో ఖాళీగా ఉన్న హావర్లీ బేస్డ్‌ టీచర్‌(హెచ్‌బీటి)పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్‌ అందె నాగమల్లయ్య తెలిపారు. పీజీటీ కామర్స్‌, కెమిస్ట్రీ హెచ్‌బీటీ పోస్టులకు గాను విద్యార్హత సంబంధిత సబ్జెక్టులో పీజీ, బీఎడ్‌ పూర్తి చేసి ఉండాలన్నారు. అనుభవం, మెరిట్‌, డెమో ద్వారా ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. అర్హత, ఆసక్తి ఉన్న అభ్యర్థులు ఈ నెల 31లోపు పాఠశాలలో దరఖాస్తులు సమర్పించాలని సూచించారు.

రేపు బహిరంగ వేలం

చెన్నూర్‌రూరల్‌: మండలంలోని కత్తెరసాల గ్రామం శ్రీ మల్లిఖార్జునస్వామి ఆలయంలో ఫిబ్రవరి 18వ తేదీన మహాశివరాత్రి పండుగను పురస్కరించుకొని 17వ తేదీ నుంచి 19వ తేదీ వరకు నిర్వహించే జాతరలో దుకాణ సముదాయాలు ఏర్పాటు చేసుకునేందుకు 31(మంగళవారం)న మధ్యాహ్నం 12గంటలకు ఆలయ ఆవరణలో గ్రామస్తుల సమక్షంలో బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు ఆలయ ఈవో ఎం.రవి తెలిపారు. కొబ్బరికాయలు, పూజా సామగ్రి, ప్రసాధం, బోనం చెల్లించేందుకు, నూనె అమ్మకానికి దుకాణ సముదాయాలు ఏర్పాటు చేసుకునేందుకు రూ.10వేల డిపాజిట్‌ చెల్లించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. దుకాణ సముదాయాలు ఏర్పాటు చేసుకునేందుకు ఆసక్తి ఉన్న వారు డిపాజిట్‌తో పాటు ఆధార్‌కార్డుతో వచ్చి వేలంలో పాల్గొనాలని పేర్కొన్నారు.

విశ్వకర్మ సంఘం నాయకుల ప్రమాణస్వీకారం



ప్రమాణ స్వీకారం చేస్తున్న సంఘం నాయకులు

జన్నారం: మండలంలోని విశ్వబ్రాహ్మణ విశ్వకర్మ ఐక్య సంఘం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నట్లు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలాధ్యక్షుడిగా కడార్ల నర్సయ్య, ప్రధాన కార్యదర్శిగా నర్సింగోజు శ్రీనివాసచారి, ఉపాధ్యక్షులుగా రేవల్లి తిరుపతి, శ్రీనివాస్‌, దేవరకొండ మహేందర్‌, కోషాధికారిగా కొత్త శ్రీని వాస్‌, దనోజు శ్రీనివాస్‌, ప్రచార కార్యదర్శిగా వేమూరి శేఖర్‌ను ఎన్నుకున్నట్లు తెలిపారు. అనంతరం నూతన కమిటీ ప్రమాణ స్వీకారం చేయగా సభ్యులు శాలువాలు కప్పి సన్మానం చేశారు.

కేతేశ్వరాలయ అభివృద్ధికి కృషి

- ఖానాపూర్‌ ఎమ్మెల్యే రేఖానాయక్‌



మాట్లాడుతున్న ఎమ్మెల్యే

జన్నారం: మండలకేంద్రంలోని శ్రీ కేతేశ్వర కంకాలమ్మ ఆలయాభివృద్ధికి కృషి చేస్తానని ఖానాపూర్‌ ఎమ్మెల్యే రేఖానాయక్‌ అన్నారు. కేతేశ్వర కంకాలమ్మ జాతర సందర్భంగా ఆదివారం ఆలయానికి వచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఎమ్మెల్యేకు మహేంద్ర సంఘం నాయకులు సన్మానం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కేతేశ్వర ఆలయం అభివృద్ధికి కృషి చేస్తానని, నల్లపోచమ్మ గుడి నుంచి ఆలయం వరకు సీసీ రోడ్డు నిర్మాణానికి రూ.5లక్షలు మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు. అనంతరం మండల కేంద్రంలో సీఎంఆర్‌ఎఫ్‌ చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. కార్యక్రమంలో రైతుబంధు సమితి అధ్యక్షుడు రాజారాంరెడ్డి, వైస్‌ ఎంపీపీ వినయ్‌కుమార్‌, మహేంద్ర సంఘం అధ్యక్షుడు నర్సింగరావు, ఉపాధ్యక్షుడు నర్సయ్య, పీఏసీఎస్‌ చైర్మన్‌ రమేశ్‌, సర్పంచ్‌ గంగాధర్‌, ఎంపీటీసీ రియాజోద్దీన్‌, పార్టీ నాయకులు సతీష్‌కుమార్‌, భరత్‌కుమార్‌, రాజేష్‌యాదవ్‌ పాల్గొన్నారు.

ఘనంగా ముత్యాలమ్మ జాతర



గోదావరి జలాలతో ప్రత్యేక పూజలు

కోటపల్లి: మండలంలోని ఎదులబంధంలో ఆదివారం ఆదివాసీ నాయక్‌పోడ్‌ సంప్రదాయాల ప్రకారం ముత్యాలమ్మ జాతర ఘనంగా ప్రారంభమైంది. మొదటిరోజు ముత్యాలమ్మతో పాటు లక్ష్మీదేవర, మధునపోచమ్మ అమ్మవార్లకు గోదావరి నదిలో పుణ్యస్నానం ఆచరించేందుకు భక్తులంతా కాలినడకన పార్‌పల్లిలోని ఉత్తరవాహిని గోదావరికి చేరుకున్నారు. అమ్మవార్లను పల్లకిలో కూర్చొబెట్టి డప్పుచప్పుళ్ల మధ్య పుణ్యస్నానానికి తీసుకొచ్చారు. అనంతరం అమ్మవార్లకు పసుపు కుంకుమలతో పట్నాలు వేసి పూజలు నిర్వహించారు. గోదావరి నదిలో శివసత్తుల పూనకాలతో నదీతీరం సందడిగా మారింది. అమ్మవార్లకు గిరిజనులు పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం తిరిగి గ్రామానికి చేరుకున్న అమ్మవార్లకు భక్తులు మంగళహారతులతో స్వాగతం పలికారు. సాయంత్రం మధునపోచమ్మకు బోనాలు పోశారు. సోమవారం లక్ష్మీదేవర బోనాలు, ముత్యలమ్మ జాతర నిర్వహిస్తున్నట్లు ఆలయ పూజారి జేక లచ్చయ్య తెలిపారు. జాతరకు వచ్చే భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పించినట్లు ఎంపీటీసీ జేక శేఖర్‌, సర్పంచ్‌ కొటారి నిర్మల పేర్కొన్నారు.

ఆధ్యాత్మికం

ఎల్లారం పోచమ్మకు మొక్కులు

భీమిని: కన్నెపల్లి మండలంలోని జన్కాపూర్‌ గ్రామపంచాయతీ పరిధిలోని ఎల్లారం పోచమ్మ ఆలయానికి ఆదివారం భక్తులు పెద్ద సంఖ్యలో వచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులు స్థానిక గుండాల వద్ద పుణ్యస్నానాలు ఆచరించి నైవేద్యం వండి అమ్మవారికి సమర్పించారు. కోళ్లు, మేకలు బలిచ్చి కల్లు శాఖ ఆరగించి మమ్మల్ని చల్లంగా చూడాలంటూ వేడుకున్నారు. అనంతరం చెట్ల కింద వంటావార్పు చేసుకొని మొక్కులు తీర్చుకున్నారు.

మల్లన్న ఆలయంలో బోనాల సందడి



పట్నం వేస్తున్న ఒగ్గు పూజారి

చెన్నూర్‌రూరల్‌: మండలంలోని కత్తెరసాలలోని శ్రీ మల్లిఖార్జున స్వామి ఆలయాని కి భక్తులు ఆదివారం అధిక సంఖ్యలో తరలివచ్చారు. ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు ఆలయ ఆవరణలో బోనాలు పోసి తీపి పదార్థాలతో స్వామివారికి నైవేద్యం పెట్టి మొక్కులు తీర్చుకున్నారు. ఒగ్గు పూజారులు పట్నాలు వేశారు.

అభివృద్ధి పనులపై దృష్టి పెట్టాలి



మాట్లాడుతున్న బీఆర్‌ఎస్‌ పట్టణ అధ్యక్షుడు రవీందర్‌

మందమర్రిరూరల్‌: పట్టణంలో జరుగుతున్న అభివృద్ధి పనులపై పార్టీ శ్రేణులు దృష్టి సారించాలని బీఆర్‌ఎస్‌ పట్టణ అధ్యక్షుడు రవీందర్‌ పార్టీ శ్రేణులకు సూచించారు. పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంప్‌ ఆఫీస్‌లో ఆదివారం జరిగిన పార్టీ కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. పట్టణ అభివృద్ధి పనులకు కావాల్సిన నిధులు మంజూరు చేయడంలో ప్రభుత్వ విప్‌, ఎమ్మెల్యే బాల్క సుమన్‌ ప్రత్యేక చొరవ చూపిస్తున్నారన్నారు. ప్రభుత్వ పథకాలు అర్హులకు అందేలా చూడాలని, అధికారులతో కలిసి పట్టణ అభివృద్ధికి తోడ్పడాలని పిలుపునిచ్చారు. సమావేశంలో పార్టీ, అనుబంధ సంఘాల నాయకులు ఉన్నారు.

జర్నలిస్టుల సంక్షేమానికి కృషి



సభ్యత్వం తీసుకుంటున్న జిల్లా జర్నలిస్టులు

పాతమంచిర్యాల: జర్నలిస్టు సంక్షేమానికి కృషి చేయనున్నట్లు టీయూడబ్ల్యూజే (ఐజేయూ)రాష్ట్ర అధ్యక్షుడు నగునూరి శేఖర్‌ అన్నారు. జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యలు సభ్యత్వ నమోదు కోసం ఆదివారం సాయంత్రం జిల్లా కేంద్రానికి వచ్చిన ఆయన పలు అంశాలపై జిల్లా జర్నలిస్టు నాయకులతో చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్నా, పెద్ద పత్రికలు చానెళ్ల అనే తారతమ్యం లేకుండా అందరినీ కలుపుని ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా పలు పత్రికల, చానెళ్ల స్టాఫ్‌ రిపోర్టర్లు సభ్యత్వాన్ని తీసుకున్నారు. సమావేశంలో టీయూడబ్ల్యూజే (ఐజేయూ)రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆర్‌ ప్రకాష్‌రెడ్డి, గాండ్ల శ్రీనివాస్‌, కరీంనగర్‌ ఉమ్మడి జిల్లా ప్రధాన కార్యదర్శి వీ.రవీందర్‌, ప్రింట్‌ ఎలక్ట్రానిక్‌ మీడియా స్టాఫ్‌ రిపోర్టర్లు, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

'టీడీపీకి పెరుగుతున్న ఆదరణ'

మందమర్రిరూరల్‌: నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీ ఆదరణ పెరుగుతుందని పెద్దపల్లి పార్లమెంట్‌ నియోజకవర్గ అధ్యక్షుడు సంజయ్‌కుమార్‌ పేర్కొన్నారు. మందమర్రి మున్సిపాలిటీ పరిధిలోని 24వ వార్డులో ఆదివారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పలువురు టీడీపీలో చేరగా, సంజయ్‌కుమార్‌ పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఊరు మందమర్రిలో సమస్యలు పేరుకుపోయాయని కనీస సౌకర్యాలు అయిన తాగునీరు, రోడ్లు, వీధి దీపాల సౌకర్యాలు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నా పట్టించుకునే అధికారులు లేరని మండిపడ్డారు.

మినీ స్టేడియం.. ప్రారంభానికి సిద్ధం

చెన్నూర్‌: పట్టణంలోని కస్తూర్బా కళాశాల పక్కన 6ఎకరాల విస్తీర్ణంలో రూ.4కోట్ల నిధులతో నిర్మించిన మినీ స్టేడియం ప్రారంభానికి ముస్తాబు చేస్తున్నారు. మినీ స్టేడియం ప్రారంభిస్తే క్రీడాకారులకు అథ్లెటిక్స్‌ ట్రాక్‌తో పాటు క్రికెట్‌, కబడ్డీ, ఖోఖో, వాలీబాల్‌, బాస్కెట్‌ బాల్‌, ఇండోర్‌ స్టేడియం, షటిల్‌ బ్యాడ్మింటన్‌, టేబుల్‌ టెన్నిస్‌, జిమ్‌ లాంటి సౌకర్యాలు మెరుగు పడనున్నాయి. త్వరలోనే ప్రభుత్వ విప్‌ బాల్క సుమన్‌ చేతుల మీదుగా మినీ స్టేడియం ప్రారంభిస్తామని అధికారులు తెలిపారు.

విరాళం అందజేత

మందమర్రిరూరల్‌: మందమర్రిలోని బురదగూడెం సమీపంలో గల మ హంకాళి అమ్మవారి ఆల య నిర్మాణానికి గోదావరిఖని రఘుపతి రావునగర్‌కు చెందిన చిట్టినేని సౌమ్య–అజయ్‌రావు దంపతులు ఆదివారం రూ.25,000 విరాళం అందించినట్లు నిర్వాహకులు తెలిపారు.